సాక్షి చిత్తూరు

మంగళవారం । 8 । ఏప్రిల్ । 2025



ఎంపీ నిధులు అడవిపాలు
టీడీపీ నేత ఎంపీ నిధులతో తమ అనుకూలమైన వారి ఇల్లు, పొలానికి సీసీ రోడ్డు నిర్మించుకున్నారు. - 8లో



వరసిద్ధుడి సేవలో మారుతి
కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారిని సోమవారం సినీ దర్శకుడు మారుతి దర్శించుకున్నారు. - 8లో



ఇంకెన్నిసార్లు.. తిరగాలి సారూ!
సమస్యల పరిష్కారానికి ప్రతివారం కలెక్టరేట్‌కు వస్తున్నాం.. ఇంకెన్నిసార్లు తిరగాలి సారూ అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. - 8లో

న్యూస్‌రీల్

డీసీహెచ్‌ఎస్‌గా పద్మాంజలిదేవి



పద్మాంజలిదేవి

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరులోని డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో సోమవారం డీసీహెచ్‌ఎస్‌గా పద్మాంజలి బాధ్యతలు స్వీకరించారు. పుంగనూరులో ఏరియా ఆస్పత్రిలో సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్న ఈమెను ఉద్యోగోన్నతిపై డీసీహెచ్‌ఎస్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆమె బాధ్యతలు స్వీకరించి, ఆస్పత్రి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇక్కడ ఇన్‌చార్జ్ డీసీహెచ్‌ఎస్‌గా పనిచేస్తున్న ప్రభావతి యథాస్థానానికి వెళ్లారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 45 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని జిల్లా ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమానికి 45 ఫిర్యాదులందాయి. సోమవారం ఎస్పీ మణికంఠ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో కుటుంబ తగాదాలు, వేధింపులు, డబ్బు తగాదాలు, భూ తగాదాలు, ఆస్తి తగాదాలకు సంబంధించినవి ఉన్నాయి. వచ్చిన ప్రతీ ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వాటిని పరిష్కరించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. అలాగే పలువురు పోలీస్ అధికారులతో వీడియో సమావేశం నిర్వహించి, బాధితుల సమస్యలపై చర్చించారు. అలాగే ఏఎస్పీ రాజశేఖర్‌రాజు సైతం ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు.

చురుగ్గా ఎన్‌సీడీ సర్వే

చిత్తూరు రూరల్(కాణిపాకం): జిల్లాలో ఎన్‌సీడీ సర్వే చురుగ్గా సాగుతోందని డీఎంఅండ్‌హెచ్ ప్రభావతిదేవి అన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. జిల్లాలో 18 ఏళ్లు పైబడినవారు 15,64,277మంది ఉండగా ఎన్‌సీడీ సర్వేలో భాగగా 9,54,643 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేశామన్నారు. ఇందులో 91,570 మందికి బీపీ, 81,668 మందికి మధుమేహం, 239 మందికి ఒరల్ క్యాన్సర్, 194 మందికి రొమ్ము క్యాన్సర్, 181 మందికి సర్వేకల్ క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించామని ఆమె పేర్కొన్నారు.

● ఎస్.రామ్‌కుమార్ బీటెక్ (కంప్యూటర్ సైన్స్) ఫైనలియర్ చదువుతున్నప్పుడే క్యాంపస్ ఇంటర్వ్యూలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఏడాదికి రూ.15 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం సంపాదించాడు. ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇచ్చి, ఉద్యోగంలో చేరాలని కంపెనీ షరతు విధించింది. ఒరిజినల్ సర్టిఫికెట్లు కాలేజీలో ఉన్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు అందలేదని, అవి వచ్చాక సర్టిఫికెట్లు ఇస్తామని కాలేజీ నిర్వాహకులు కొర్రీ పెట్టారు. లేదంటే ఫీజు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకోవాలని.. ప్రభుత్వం నుంచి నిధులొచ్చాక తిరిగిస్తామని పేర్కొంది. దీంతో ఎస్.రామ్‌కుమార్ తండ్రి అప్పుచేసి కాలేజీలో ఫీజు చెల్లించాడు. నెలనెలా తీసుకున్న వడ్డీకి కడుతున్నాడు.

● జిల్లాలోని పూతలపట్టు మండలానికి చెందిన టీడీపీ కార్యకర్త కుమార్తె పుష్పితను నూజివీడు పాలిటెక్నిక్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదివిస్తున్నాడు. రూ.30 వేలు ఫీజు చెల్లించలేదని ఆ కళాశాల యాజమాన్యం హాల్‌టికెట్ ఇవ్వడం లేదని, హాల్‌టికెట్ ఇప్పించి పరీక్ష రాసేలా సహాయం చేయాలని విద్యాశాఖ మంత్రి లోకేష్ ట్విట్టర్‌కు ట్యాగ్ చేసి వేడుకున్నాడు. ఇదీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో ఉన్నతవిద్య చదివే విద్యార్థులు అవస్థలు పడుతున్నారనడానికి నిదర్శనం. ఈ సమస్య వీరిద్దరిదీ మాత్రమే కాదు. జిల్లాలోని వేలాది మంది విద్యార్థులు ఎదుర్కొంటున్న పరిస్థితి.

అసలే పరీక్షల కాలం.. ఆపై విద్యార్థులు ఆందోళన సమయం.. దీనికితోడు అందని ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం.. ఫీజు చెల్లించాల్సిందేనని, లేదంటే హాల్‌టికెట్లు ఇవ్వబోమని కళాశాలల యాజమాన్యాల హుకుం.. ఇందుకు తల్లిదండ్రులు అప్పులు చేయాల్సి వస్తున్న వైనం.. అన్నీ తెలిసీ చేష్టలుడిగి చూస్తున్న కూటమి ప్రభుత్వం.. వెరసి.. ఉన్నత చదువులకు చంద్రగ్రహణం పట్టింది. ఫలితంగా విద్యార్థులకు ఫీజు భారమై.. భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.



ఫీజు భారమై.. భవిత ప్రశ్నార్థకమై!

- పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు
- విద్యార్థుల ఎదురుచూపులు
- ఫీజుల చెల్లింపునకు అప్పులు చేస్తున్న తల్లిదండ్రులు
- ఇబ్బందులు సృష్టిస్తున్న ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రైవేట్ ఉన్నత కళాశాలల్లో విద్యను అభ్యసిస్తున్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా ఇబ్బందులు సృష్టిస్తోంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారంలోకి రాగానే ఉన్నత విద్య చదివే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగనివ్వబోమని కూటమి హామీ ఇచ్చింది. అయితే అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తవుతున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల నిధులు విడుదల చేయలేదు. దీంతో విద్యార్థులకు కాలేజీల్లో సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ఫలితంగా వారు ఉన్నత చదువులు చదవడానికి, ఉద్యోగాల్లో చేరలేక ఇక్కట్లు పడుతున్నారు.

పరీక్షల సమయంలోనే ఇబ్బందులు

అసలే పరీక్షలు రాసే సమయంలో విద్యార్థులు టెన్షన్‌కు లోనవుతుంటారు. ఇలాంటి సమయంలో ఫీజులు చెల్లించలేదని, ఫీజు కడితేనే హాల్‌టికెట్‌లు ఇస్తామని యాజమాన్యాలు హుకుం జారీ చేస్తున్నాయి. కళాశాలలో అందరు విద్యార్థుల ఎదుట ఫీజు చెల్లించలేదంటూ బయటకు పంపించి, అవమానం చేస్తున్నారు. దీంతో పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి లోనవుతున్నారు. అంతేకాకుండా పరీక్షలు సరిగ్గా రాయలేక మానసికంగా కుంగిపోతున్నారు. వీటన్నింటికి కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పి, తీరాలని విద్యార్థి సంఘాల నాయకులు నిలదీస్తున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ వివరాలు

నియోజకవర్గం	విద్యార్థులు	పెండింగ్ మొత్తం (రూ.కోట్లలో)
చిత్తూరు	2517	4,82,02,359
నగరి	3444	6,20,96,235
పుంగనూరు	4694	8,76,63,867
పూతలపట్టు	3006	6,28,15,905
పలమనేరు	4252	6,99,16,920
కుప్పం	3049	5,04,42,063
గంగాధరనెల్లూరు	3187	6,64,84,512
మొత్తం	24,149	44,76,21,861

జిల్లాలోని కళాశాలల సమాచారం

డిగ్రీ కళాశాలలు	116
ఇంజినీరింగ్ కళాశాలలు	14
ఐటీఐ కళాశాలలు	18
నర్సింగ్ కళాశాలలు	7
పాలిటెక్నిక్ కళాశాలలు	8
మెడికల్	2
బీఈడీ కళాశాలలు	7
ఎంబీఏ, ఎంసీఏ	11
మొత్తం కళాశాలలు	183

పేరుకుపోయిన బకాయిలు

జిల్లా వ్యాప్తంగా ఉన్నత విద్య చదువుతున్న 24,149 మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులుగా ఉన్నారు. వీరందరికీ రూ.44.76 కోట్లు నిధులు బకాయిలు పేరుకుపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తవుతున్నా పేరుకుపోయిన బకాయిల గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. ఫీజు నిధులు అందకపోతుండడంతో కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నాయి.

సర్టిఫికెట్‌లు ఇవ్వకుండా ఇబ్బందులు

కూటమి సర్కారు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్‌లు ఇవ్వకుండా ఇబ్బందులు సృష్టిస్తున్నాయి. డబ్బులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని, దిక్కున చోట చెప్పుకోండంటూ దురుసుగా ప్రవర్తిస్తున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేదేమీ లేక పలువురు విద్యార్థుల తల్లిదండ్రుల అధిక వడ్డీకి అప్పులు చేసి, మరీ ఫీజులు చెల్లిస్తున్నారు. అప్పులు దొరకని తల్లిదండ్రులు కళాశాలల యాజమాన్యాల ఒత్తిడిని అనుభవిస్తూనే ఉన్నారు. ఉన్నత విద్య చదివే విద్యార్థుల పట్ల కూటమి టీడీపీ చిన్నచూపు చూడటం సరికాదని విద్యార్థి సంఘాల నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే మంజూరు చేయకపోతే ఆందోళన బాట పడతామని విద్యార్థి సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

రీయింబర్స్‌మెంట్ పథకానికి తూట్లు



కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి తూట్లు పొడుస్తోంది. బకాయిలు సకాలంలో చెల్లించడంలో అలసత్వం వహించడం సరికాదు. వేలాది మంది ఉన్నతవిద్య చదివే విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతాం. ఫీజులు చెల్లించకపోతే హాల్‌టికెట్‌లు ఇవ్వమని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులు పెడితే కళాశాలల ఎదుట ధర్నా చేస్తాం.

– శివారెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యదర్శి

విద్యార్థుల బాధలు అర్థం కావా?



కూటమి ప్రభుత్వానికి ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థుల బాధలు అర్థం కావా? అని ప్రశ్నిస్తున్నాం. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు నెలలు గడుస్తున్నా విడుదల చేయకపోవడం దారుణం. ఫీజులు చెల్లించేందుకు తల్లిదండ్రులు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. అప్పు దొరకని తల్లిదండ్రులు వారి పిల్లలను మధ్యలోనే చదువు మాన్పించేస్తున్నారు. ఫీజుల పెండింగ్‌తో చదువు మానేయాల్సిన దుస్థితి ఏర్పడడం కరెక్టు కాదు. కూటమి ప్రభుత్వం స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి.

– సద్దాం, ఐక్య విద్యార్థి సంఘాల చైర్మన్, చిత్తూరు జిల్లా

ట్యాబ్‌ల కోసం ఆందోళన

● డీఈఓకు ఫిర్యాదు

పుంగనూరు: పట్టణంలోని కొత్తయిండ్లు హైస్కూల్‌లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన 192 మంది విద్యార్థుల ట్యాబ్‌లను హెచ్‌ఎం వెనక్కి తీసుకోవడంతో విద్యార్థులు ఆందోళన చేశారు. ఈ విషయమై డీఈఓకు ఫిర్యాదు చేయడంతో సోమవారం వాటిని తిరిగి విద్యార్థులకు వాపస్సు ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. కొత్తయిండ్లు హైస్కూల్‌లో 192 మంది విద్యార్థులు ఉన్నారు. గత ప్రభుత్వంలో వీరందరికీ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. వాటిని హెచ్‌ఎం సుబ్రమణ్యం విద్యార్థుల వద్ద నుంచి బలవంతంగా గత ఏడాది తీసుకునేశారు. పరీక్షలు పూర్తి అయినా వాపస్సు ఇవ్వకపోవడంతో తల్లిదండ్రులు డీఈఓకు ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా నోడల్ ఆఫీసర్ సుధాకర్ హైస్కూల్ వచ్చి, హెచ్‌ఎంతో మాట్లాడి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేయించారు. దీనిపై ఆయన నివేదికలను డీఈఓకు పంపుతామని తెలిపారు. తల్లిదండ్రులు ఈ విషయమై నోడల్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎం బలవంతంగా ట్యాబ్‌లు లాక్కున్నారని, నిర్లక్ష్యంగా మాట్లాడుతూ వాపస్సు ఇచ్చేది లేదని చెప్పడంతో డీఈఓకు ఫిర్యాదు చేశామని తెలిపారు. కాగా హెచ్‌ఎంను వివరణ కోరగా విద్యార్థులు ఇతర కార్యక్రమాలకు ట్యాబ్‌లు వినియోగిస్తూ పక్కదారి పడుతున్నందున ట్యాబ్‌లు తీసుకున్నామని తెలిపారు.



పుంగనూరులో ట్యాబ్‌లు తీసుకున్న విద్యార్థులు

మంచి ఆహారంతో ఆరోగ్యకర జీవనం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మంచి ఆహారంతో మనిషికి ఆరోగ్యకరమైన జీవనం చేకూరుతుందని, అందుకు పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా లీగల్ సెల్ అథారిటీ జడ్జి భారతి, డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి సూచించారు. చిత్తూరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం జిల్లా లీగల్‌సెల్ అథారిటీ జడ్జి భారతి అధ్యక్షతన ప్రపంచ ఆరోగ్య దినోత్సవంపై అవగాహన కార్యక్రమంపై నిర్వహించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 72,960 మంది స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.63 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఆగిన ఆరోగ్యశ్రీ

- జిల్లా వ్యాప్తంగా నిలిచిపోయిన సేవలు
- నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో రోగుల అవస్థలు
- పట్టించుకోని కూటమి నేతలు



నెట్‌వర్క్ ఆస్పత్రిలో వెలవెలబోయిన ఆరోగ్యశ్రీ కౌంటర్

తిరుపతి తుడా: ఆరోగ్యశ్రీకి ముసలం పట్టుకుంది. నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లులు చెల్లించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. ఈ క్రమంలో తిరుపతి జిల్లా వ్యాప్తంగా అన్ని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేశారు. వైద్యం అందక పేద రోగులు అల్లాడిపోతున్నారు.

తిరుపతి జిల్లాలో 38 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ వైద్య సేవలందిస్తున్నారు. పేరుకుపోయిన బకాయిలు ఏప్రిల్ 6వ తేదీలోపు చెల్లించాలని ఆయా ఆస్పత్రుల నిర్వాహకులు అల్టిమేటం జారీ చేశారు. కానీ కూటమి నేతలు పట్టించుకోలేదు. దీంతో ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ ముందస్తుగా ప్రకటించిన మేరకు సోమవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేసింది. ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కౌంటర్లు వెలవెలబోతున్నాయి. వైద్యం కోసం వచ్చిన పేద రోగులు వెనుదిరుగుతున్నారు.

బకాయిలు విడుదల చేస్తేనే..

జిల్లా వ్యాప్తంగా నెట్‌వర్క్ ఆస్పత్రులకు గత 12 నెలలుగా రూ.220 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. వీటిని కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో చెల్లిస్తేగానీ ఆరోగ్యశ్రీని కొనసాగించలేమని ఆస్పత్రుల నిర్వాహకులు తేల్చిచెప్పారు. రూ.10 కోట్లు రావాల్సిన ఆస్పత్రులకు రూ.50 లక్షలు విడుదల చేస్తే ఎలా నడపాలని ఆవేదన చెందుతున్నారు.

అయోమయంలో రోగులు

ప్రభుత్వం దిగివచ్చి బకాయిలు చెల్లించని పక్షంలో ఆరోగ్యశ్రీ వైద్యసేవలు పూర్తిగా పేదలకు దూరం కానున్నాయి. ఇప్పటికే నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో పదుల సంఖ్యలో రోగులు అడ్మిషన్లు తీసుకుని ఉన్నారు. మరికొందరు శస్త్ర చికిత్సలు చేసుకుని వైద్యసేవలు పొందుతున్నారు. ఇంకొందరు ఆరోగ్యశ్రీ అనుమతుల కోసం బెడ్‌లపై నిరీక్షిస్తున్నారు. ఇప్పుడు ఉన్నఫళంగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడంతో పేద రోగుల పరిస్థితి అయోమయంలో పడింది. వెంటనే బకాయిలు చెల్లించి పేద రోగులకు ఆరోగ్యశ్రీ భరోసా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆరోగ్యశ్రీ మాటెత్తితే మండిపడుతున్నారు



మాది రేణిగుంట. నేను తిరుపతి నగరంలోని ఓ చెప్పుల షాపులో కూలీగా పనిచేస్తున్నాను. నాకు రెండుకాళ్లు వాచిపోయాయి. కిడ్నీలు దెబ్బతిన్నాయనే అనుమానం ఉంది. తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి సోమవారం వెళ్లి ఆరోగ్యశ్రీ కార్డు చూపించా. అక్కడున్న సిబ్బంది దయచేసి వెళ్లిపోండి అని చెప్పారు. నేను నా భార్య బతిమలాడినా వినిపించుకోలేదు. చేసేది లేక ఇంటికి వచ్చేశాం.

–రమణాచారి, మంగళం, తిరుపతి

విశ్రాంత తహసీల్దార్ మోహనవల్లి పింఛన్‌లో కోత

చిత్తూరు కలెక్టరేట్ : ఇటీవల ఉద్యోగవిరమణ పొందిన తవణంపల్లి తహసీల్దార్ మోహనవల్లి పింఛన్‌లో కోత విధిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సిసోడియా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె గతంలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న సమయంలో ఎటువంటి కారణం లేకుండా 53 పట్టాదారు పాసు పుస్తకాలను ఆన్‌లైన్‌లో తిరస్కరించింది. ఇందుకుగాను గతంలో ఆమెకు మూడు ఇంక్రిమెంట్‌లు, డిప్యూటీ తహసీల్దార్ టీబీ నరేష్‌కుమార్‌కు ఒక ఇంక్రిమెంట్ రద్దు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. అయితే తహసీల్దార్ మోహనవల్లి ఉద్యోగవిరమణ పొందినట్లు ఇటీవల కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ సీసీఎల్‌ఏకు నివేదిక ఇచ్చారు. దీంతో గతంలో జారీ చేసిన ఉత్తర్వులను సవరిస్తూ ప్రస్తుతం ఒక సంవత్సరం పాటు ఆమెకు వచ్చే పెన్షన్‌లో 3 శాతం కోత విధించాలని ఆదేశించారు.

ఆరోగ్యానికి మించిన ఐశ్వర్యం లేదు

పలమనేరు: మనిషికి సంపూర్ణ ఆరోగ్యనికన్నా మించిన ఐశ్వర్యం లేదని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పలమనేరు మండలంలోని కొలమాసనపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని, ప్రజలు ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. మంచి ఆహారపు అలవాట్లను పాటిస్తూ వ్యాయామం తప్పక చేయాలని తెలిపారు. ముఖ్యంగా ప్రతి ఒక్క రూ నడక లాంటి వ్యాయామాలను క్రమం తప్పకుండా చేయాలన్నారు. సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది

చిత్తూరులో ఆరోగ్యశ్రీకి గండం

- నీరసించిన ఆరోగ్యశ్రీ సేవలు
- బిల్లులు రాక నెట్‌వర్క్ ఆస్పత్రులకు పాట్లు
- పట్టించుకోని ప్రభుత్వం
- సేవల కొనసాగింపునకు ఆదేశాలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): జిల్లాలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు నీరసించిపోతున్నాయి. బిల్లులు విషయంలో ప్రభుత్వం జాప్యం చేస్తోంది. దీంతో నెట్‌వర్క్ ఆస్పత్రులు పడరాని పాట్లు పడుతున్నాయి. తద్వారా నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్య సేవలు మందగిస్తున్నాయి. సీఎం సొంత జిల్లా కావడంతో ఆస్పత్రులకు ముందస్తుగానే సేవలు కొనసాగించాలని ఆదేశాలు జారీ చేశారు. చిత్తూరు నగరంలోని ఓ ఆస్పత్రి మాత్రం ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ పిలుపునకు బంద్ పాటించింది. ఆరోగ్య మిత్రలకు నోటీసులిచ్చి బంద్ పాటించింది. సేవలను నిలుపుదల చేసింది. బిల్లులు పేరుకుపోవడంతో ఆస్పత్రి నిర్వహణ కష్టతరంగా మారుతోందని పలు ఆస్పత్రుల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం సొంత జిల్లా కావడంతో అలా నెట్టుకొస్తున్నామని చెప్పుకొస్తున్నారు. రూ.కోట్లకు చేరిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై రాష్ట్ర అధికారులు, పాలకులను కలిసిన బిల్లుల చెల్లింపులో కదలికలు లేవని వాపోతున్నారు. ఇలానే కొనసాగిస్తే నెట్‌వర్క్ ఆస్పత్రులను మూసివేయాల్సి వస్తోందని వారి హెచ్చరిస్తున్నారు.

క్లుప్తంగా

నేరస్తుడి అరెస్టు

యాదమరి: ప్రభుత్వ పాఠశాలల్లో టీవీల చోరీ ఘటనలో పరారీలో ఉన్న నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఈశ్వర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో టీవీలు చోరీ జరిగిన కేసులో ఐదుగురు నిందితులను శనివారం అరెస్టు చేసినట్లు చెప్పారు. అయితే ఈ కేసులో ఏ2 నిందితుడిగా ఉన్న తెల్లరాళ్లపల్లి పంచాయతీ సంపంగి నెల్లూరుకు చెందిన దామోదరం(24) అనే నిందితుడిని సోమవారం తమిళనాడు సరిహద్దులోని కన్నికాపురం బస్టాప్ వద్ద అరెస్టు చేశామన్నారు. అతని వద్ద నుంచి రూ.1.35 లక్షల విలువైన ఒక టీవీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

పుంగనూరు: ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కొండసముద్రంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు కొండసముద్రం గ్రామానికి చెందిన గంగులప్ప భార్య కవిత(40) అప్పులు చేసి బంధువులకు రూ.3 లక్షలు ఇచ్చింది. వారు సకాలంలో తిరిగి ఇవ్వకపోవడం, అప్పులు చెల్లించలేకపోవడంతో మనస్తాపానికి గురైంది. ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన కవిత తిరిగి రాలేదు. ఉదయం గ్రామానికి సమీపంలోని చింతచెట్టుకు ఉరివేసుకుని మృతి చెంది ఉండటాన్ని గమనించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కుప్పం: కుప్పం సమీపంలోని బిసానత్తం రైల్వే స్టేషన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. సోమవారం ఉదయం 9.20 గంటలకు రైలులో ప్రయాణిస్తూ కిందపడడంతో తలకు బలమైన గాయాలై మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు తెల్లటి రంగు, ఎలిఫెంట్ గ్రే కలర్ షర్టు, నీలి రంగు జీన్సు ప్యాంటు ధరించివున్నాడు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు కుప్పం రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఇంకెన్నిసార్లు.. తిరగాలి సారూ!

- కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- అర్జీలు అందజేసిన పలు ప్రాంతాల ప్రజలు
- వివిధ సమస్యలపై 343 అర్జీలు నమోదు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ



ప్రజల సమస్యలను వింటున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : 'క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కావడం లేదు. సమస్యల పరిష్కారం కోసం ప్రతి వారం కలెక్టరేట్‌కు కాళ్లరిగేలా తిరుగుతున్నాం.. కలెక్టరేట్‌లో అర్జీలు ఇచ్చిన సమయంలో పరిష్కరిస్తామని చెబుతారే కాని నెలలు గడిచినా సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఇంకెన్ని సార్లు తిరగాలి సారూ..' అంటూ అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అర్జీలను స్వీకరించారు. పలు సమస్యలపై 343 అర్జీలు నమోదైనట్లు కలెక్టరేట్ ఏఓ కులశేఖర్ వెల్లడించారు. సమస్యలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీఓ శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ అనుపమ పాల్గొన్నారు.

శాఖల వారీగా నమోదైన అర్జీలిలా..

రెవెన్యూ శాఖ 296, పోలీస్ 10, పంచాయత్ రాజ్ 4, ఎండోమెంట్ 1, డీఆర్‌డీఏ 22, డీసీహెచ్‌ఎస్ 1, మున్సిపల్ కమిషనర్ చిత్తూరు 2, డీఎస్‌ఓ 4, విద్యుత్ శాఖ 2, డిస్ట్రిక్ వాటర్ రిసోర్సెస్ ఆఫీసర్ 1 అర్జీ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటున్నారు

తమ గ్రామంలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటున్నారని పెనుమూరు మండలం కంబాలచేను వాసులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. పరిశీలించి, న్యాయం చేయాలని కోరారు.

ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేస్తున్నారు

తమ గ్రామంలోని డీకేటీ భూమిని ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేస్తున్నారని పెనుమూరు మండలం కమ్మచన్నయ్యపల్లి వాసులు ఫిర్యాదు చేశారు. ఫెన్సింగ్‌ను తొలగించి న్యాయం చేయాలని కలెక్టర్‌ను ఆ గ్రామస్తులు వేడుకున్నారు.

సదరమ్ సర్టిఫికెట్ ఇవ్వలేదు

సదరమ్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు మంజూరు చేయలేదని యాదమరి మండలం షికారికాలనీకి చెందిన దివ్యాంగురాలు ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆమె కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

పూరి గుడిసెల్లోనే ఉంటున్నాం

సంవత్సరాల తరబడి పూరిగుడిసెల్లోనే ఉంటున్నామని గంగాధరనెల్లూరు మండలం కొత్తూరు ఎస్టీ కాలనీ వాసులు కొండయ్య, రమణమ్మ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ మిట్టకొత్తూరు ఎస్టీ కాలనీలో 14 కుటుంబాలు పూరి గుడిసెల్లోనే నివసిస్తున్నట్లు తెలిపారు. పలు మార్లు పక్కా ఇళ్లకు దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఇళ్ల పట్టాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని వారు కోరారు.

ప్రభుత్వ భూములు అమ్మేస్తున్న తిరుపతి రూరల్ తహసీల్దార్



తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఫిర్యాదు చేస్తున్న తిరుపతి రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీలు మాదవరెడ్డి, యశోద, సర్పంచ్‌లు, పార్టీ నేతలు

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు
- ఆధారాలతో సమర్పించిన ప్రజాప్రతినిధులు
- విచారణకు జేసీని ఆదేశించిన కలెక్టర్

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండల పరిధిలోని ప్రభుత్వ భూములను అక్రమార్కుల చేతుల్లోకి చేర్చి అవినీతికి పాల్పడుతున్న తిరుపతి రూరల్ తహసీల్దార్ రామాంజులు నాయక్‌పై విచారణ జరిపించాలని తిరుపతి రూరల్ మండల ప్రజాప్రతినిధులు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కోరారు. తిరుపతి రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్‌ఎంపీపీలు మాధవరెడ్డి, యశోద, జెడ్పీటీసీ సభ్యురాలు రత్నమ్మతోపాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిశారు. తిరుపతి రూరల్ మండలం తహసీల్దార్ రామాంజులు నాయక్ అండగా ఉండడంతో తరతరాలుగా కాపాడుకుంటూ వచ్చిన భూములన్నీ అక్రమార్కుల పరం అవుతున్నాయని ఫిర్యాదు చేశారు. అనంతరం ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తిరుపతి రూరల్ తహశీల్దారుగా రామాంజుల నాయక్ వచ్చినప్పటి నుంచి ఆక్రమణదారుల చెంతకు చేరిన ప్రభుత్వ, మఠం, ఇనాం, కాలువ, చెరువు భూముల వివరాలను ఆధారాలతో సహా కలెక్టర్‌కు అందజేశామని తెలిపారు. భూ ఆక్రమణలకు సంబంధించి ఎవ్వైనా తహసీల్దార్‌కు సమాచారం ఇస్తే వారి వివరాలను క్షణాల్లో ఆక్రమణదారులకు అందుతున్నాయంటే ఆయన ఏ రకంగా వారితో ఆక్రమణదారులతో లాలూచీ పడ్డారో అర్థం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ భూముల దురాక్రమణలపై పత్రికల్లో ప్రచురించిన కథనాలు ప్రతులను కూడా కలెక్టర్‌కు అందజేశామని తెలిపారు. భూ ఆక్రమణదారులతో బేరం పెట్టి వసూళ్లకు పాల్పడుతున్నట్టు సాక్ష్యాలు కూడా ఆధారాలు కూడా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి తహసీల్దార్‌పై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ప్రజలందరితో కలసి కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్షలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. పది రోజుల సమయం తరువాత ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధమవుతున్నట్టు చెప్పారు. ఫిర్యాదు స్వీకరించిన కలెక్టర్ పూర్తిస్థాయి విచారణకు జేసీని ఆదేశిస్తున్నట్టు తెలిపారన్నారు.

వరసిద్ధుడి సేవలో మారుతి

కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని సోమవారం సినీ దర్శకుడు మారుతి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సిబ్బంది ఘనస్వాగతం పలికి స్వామి దర్శనం కల్పించారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో ఆశీర్వచనం, ప్రసాదం, చిత్ర పటం అందజేశారు.

ఏఎన్‌ఎం గ్రేడ్ 3 ఉద్యోగోన్నతులు చేపట్టాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ హంస సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏఎన్‌ఎం గ్రేడ్ 3 ఉద్యోగోన్నతులు వెంటనే చేపట్టాలని ఏపీ హంస ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రాజా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు సోమవారం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎం గ్రేడ్–3కు ఉద్యోగోన్నతులు ఇవ్వకుండా ఆలస్యం చేస్తున్నారన్నారు. దీంతో చాలా నెలలుగా ఏఎన్‌ఎంలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు. ఎలాంటి అభ్యంతరాలు లేకపోతే త్వరగా తుది జాబితా విడుదల చేసి, ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ హంస ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి టాటాబాయి, కోశాధికారి ఇమ్రాన్, తిరుపతి తాలూకా సంయుక్త కార్యదర్శి జ్యోతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో రగులుకున్న వర్గపోరు

- బొబ్బిలిరాజాను చితక బాదిన పోలీసులు
- అపస్మారక స్థితికి చేరుకున్న బొబ్బిలిరాజా

కార్వేటినగరం: ఎమ్మెల్యే సొంత మండలంలో వర్గపోరు తారస్థాయికి చేరుకుంది. గంగాధరనెల్లూరు నియోజకవర్గం ఎమ్మెల్యే థామస్, అతని సోదరుడు నిధి మధ్య కొన్నాళ్లుగా విభేదాలు రగులుతున్నాయి. అయితే రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే థామస్‌కు వ్యతిరేకంగా నిధి వర్గంలో ఒకరైనా గోపిశెట్టిపల్లి గ్రామానికి చెందిన బొబ్బిలిరాజా తమ్ముడు మణికంఠ సోషల్ మీడియాలో పోస్టు చేశారన్న విషయంపై రెండు వర్గాలు ఒకరిపై ఒకరి కార్వేటినగరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. అయితే ఈ వివాదం జిల్లా కేంద్రానికి చేరుకుంది. దీంతో చిలికిచిలికి గాలివానై ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో చిత్తూరులోని ఓ బడా టీడీపీ నాయకుడు ఇరు వర్గాలకు సర్ది చెప్పినా వినక పోవడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారుజ దీంతో నిధి వర్గానికి చెందిన బొబ్బిలిరాజా తమ్ముడు మణికంఠతో పాటు నలుగురిపై కేసు నమోదు చేశారు. దీంతో తన కుటుంబంపై కేసులు పెట్టి వేధిస్తున్నారని బొబ్బిలిరాజా నిలదీయడంతో పోలీసులు అతనిని చితకబాదినట్లు సమాచారం. దీంతో అపస్మారక స్థితికి చేరుకున్న అతన్ని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారని స్థానికులు తెలిపారు. అయితే కార్వేటినగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హనుమంతప్పను వివరణ కోరగా బొబ్బిలిరాజా తమ్ముడు మణికంఠ ఎమ్మెల్యే థామస్‌పై అసభ్యంగా సోషల్ మీడియాలో పోస్టు చేశారని ఫిర్యాదు అందడంతో అతన్ని స్టేషన్‌కు పిలిపించామని, దీంతో ఎమోషనల్‌కు గురై కింద పడిపోవడంతో ఆస్పత్రిలో చేర్పించామని, ఇదీ జరిగిన వాస్తవమని, పోలీసులు ఎవరిపై దాడి చేయలేదని తెలిపారు.



పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న నిధి వర్గానికి చెందిన టీడీపీ కార్యకర్త బొబ్బిలిరాజా

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా అరుణ సారిక

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో న్యాయమూర్తుల బదిలీ

చిత్తూరు అర్బన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి)గా అరుణ సారిక నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు న్యాయమూర్తులను బదిలీ చేస్తూ హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా మచిలీపట్నంలో పనిచేస్తున్న అరుణ సారికను చిత్తూరు జిల్లా జడ్జిగా బదిలీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న ఇ.భీమారావును అనంతపురం జిల్లా జడ్జిగా నియమించింది. చిత్తూరులోని పోక్సో కోర్టు జడ్జిగా పనిచేస్తున్న ఎస్.శాంతిని కడప ఫ్యామిలీ కోర్టుకు, 6వ అదనపు జిల్లా జడ్జి బి.బాబూనాయక్‌ను మచిలీపట్నం ఎస్సీ–ఎస్టీ కోర్టుకు, రాజమహేంద్రవరంలో పనిచేస్తున్న ఆర్.శ్రీలతను మదనపల్లె 7వ జిల్లా సెషన్స్ జడ్జిగా, రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టు జడ్జి పీవీఎస్.సూర్యనారాయణ మూర్తిని మదనపల్లె 2వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జిగా, ఇక్కడ పనిచేస్తున్న బందెల అబ్రహాంను విజయవాడ 7వ అదనపు, జిల్లా సెషన్స్ జడ్జిగా, తూర్పుగోదావరి రామచంద్రాపురంలో పనిచేస్తున్న ఎం.శంకర్‌రావును చిత్తూరు పోక్సో కోర్టు జడ్జిగా బదిలీ చేసింది. అలాగే గూడూరు 7వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జిగా పనిచేస్తున్న షమి పర్వీన్ సుల్తానా బేగంను గుంటూరు పోక్సో కోర్టుకు, నెల్లూరులో ఫ్యామిలీ కోర్టులో పనిచేస్తున్న కె.వెంకటనాగపవన్‌ను గూడూరు 7వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జిగా బదిలీ చేసింది.

జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ రాష్ట్ర జట్ల ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్ : జాతీయస్థాయి అండర్–16 బాస్కెట్‌బాల్ పోటీలకు ఏపీ తరఫున రెండు జట్లు ఎంపిక చేసినట్లు ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెంగల్‌రాయనాయుడు తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో ఎంపికైన జట్ల క్రీడాకారులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 16వ తేదీ వరకు పుదుచ్చేరిలో 40వ జాతీయ స్థాయి అండర్–16 యూత్ బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహిస్తారన్నారు. ఈ పోటీలకు ఏపీ తరఫున రెండు జట్లు పాల్గొంటున్నట్లు చెప్పారు. 24 మంది బాల, బాలికలకు వేర్వేరుగా ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అందులో ప్రతిభ కనబరిచిన 12 మంది క్రీడాకారుల చొప్పున బాలురు, బాలికల జట్లుగా ఎంపిక చేశామన్నారు. అతిథిగా పాల్గొన్న ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తితో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మోహన్‌రావు, కార్యదర్శి సురేశ్, డీఎస్‌డీఓ బాలాజీ, కోచ్‌లు బాబు, జగదీశ్, ప్రసన్న కుమార్, శ్రీనివాసులు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ స్థాయి యూత్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారుల జట్లు

50 ఏళ్లుగా ఎలాంటి గుర్తింపూ లేదు

చిత్తూరు కలెక్టరేట్ : 50 సంవత్సరాలుగా నివసిస్తున్నారు..అయినా ఇప్పటివరకు తవణంపల్లి మండలం ఏ.గొల్లపల్లి ఎస్సీ కాలనీ వాసులకు ఎలాంటి గుర్తింపు లేదని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. సోమవారం ఆ గ్రామస్తులతో కలిసి కలెక్టర్ దృష్టికి ఈ వివరాలు తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 50 ఏళ్లుగా ఒకే కాలనీలో నివసిస్తున్నప్పటికీ వారి గృహాలకు ప్రభుత్వ గుర్తింపు, ధ్రువీకరణ లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న వారు భవిష్యత్‌లో వారి వారసులకు గృహాలపై హక్కులను ఎలా తర్జుమా? చేయగలరని చెప్పారు. చాలా ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కుంటున్నారన్నారు. ఈ సమస్యపై కలెక్టర్ స్పందిస్తూ ప్రత్యేకాధికారిని నియమించి, విచారణ జరిపి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే బంగారుపాళెం మండల కేంద్రంలో దాదాపు వెయ్యి ఎస్సీ కుటుంబాలున్నట్లు తెలిపారు. అంతిమ సంస్కారానికి భూమి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. శ్మశానవాటికకు భూమి కేటాయించాలని కోరారు.



కలెక్టర్‌కు వివరాలు చెబుతున్న ఏ.గొల్లపల్లి ఎస్సీ కాలనీ వాసులు


ఎంపీ నిధులు అడవిపాలు



ఆవుల షెడ్డు కోసం సీసీ రోడ్డు

శ్రీరంగరాజపురం: అధికార బలంతో కూటమి నాయకులు రెచ్చిపోతున్నారు. తమకు అనుకులంగా ఉన్న వారి ఇంటికి సీసీ రోడ్డు వేస్తున్నారు. తమకు అనుకూలంగా లేని ప్రజల నివాసాలకు మాత్రం సీసీ రోడ్డు వేయని పరిస్థితి మండలంలోని నెలకొంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మంగుంట గ్రామానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావుకు చెందిన ఎంపీ ల్యాడ్స్ సుమారు రూ.28 లక్షలు రోడ్ల నిర్మాణానికి మంజూరు చేయించుకున్నారు. ఆ నాయకుడు ఎంపీ నిధులతో తనకు అనుకూలంగా ఉన్న వారి ఇంటికి, పొలానికి సీసీ రోడ్డు నిర్మించారు. ఇందులో భాగంగానే టీడీపీ నాయకుడు ఆవుల షెడ్డు, అతని ఇంటి వరకు దాదాపు రూ.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రం నుంచి అడవిలోకి సుమారు 10 లక్షలతో సీసీరోడ్డు వేశారు. కానీ అవసరం ఉన్న మంగుంట దళితవాడ, ఆదిఆంధ్రవాడ గ్రామాలు మాత్రం మట్టిరోడ్డుతో దర్శనమిస్తున్నాయి. రోడ్డు లేక దళితవాడ, ఆది ఆంధ్రవాడ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ నాయకుడు ఇంటికీ, పొలానికి, ఆవుల షెడ్డు కోసం నిర్మించుకున్న సీసీ రోడ్డును మంగళవారం చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ప్రారంభించనున్నారు.

అగ్ని ప్రమాదాల సమయంలో సమయస్ఫూర్తి అవసరం



పోలీసులకు తర్ఫీదు ఇస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చిత్తూరు అర్బన్: అగ్నిప్రమాదాలు జరిగినపుడు పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరించాలని జిల్లా అగ్నిమాపక అధికారి పెద్దిరెడ్డి సూచించారు. సోమవారం చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో దాదాపు 90 మంది పోలీసులకు అగ్నిప్రమాదాలు జరిగినపుడు ఎలా వ్యహరించాలి..? ప్రాథమిక కర్తవ్యం..? అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. ప్రమాదాల సమయంలో అగ్నిమాపక నిరోధకాలను ఉపయోగించే పద్ధతి, చుట్టుపక్కల ఉన్న నీటిని ఎలా వాడాలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏనుగు గాయపడిన కేసులో ఇద్దరి అరెస్టు

చిత్తూరు కార్పొరేషన్: బంగారుపాళెం మండలం బోడబండ్ల బీట్ పరిధిలోని జమ్మునేరేడుపల్లి వద్ద నాటు బాంబు పేలి ఏనుగు గాయపడిన కేసులో ఇద్దరిని సోమవారం అటవీ శాఖాధికారులు అరెస్టు చేశారు. అడవి పందుల కోసం మామిడి తోటలో అమర్చిన నాటు బాంబును గత గురువారం రాత్రి ఓ ఏనుగు తొక్కడంతో అది పేలి ఏనుగు గాయపడిన విషయం తెలిసిందే. సంఘటన స్థలంలో ఏనుగు రక్తం ఆధారంగా అది గాయపడినట్లు అటవీశాఖాధికారులు గుర్తించారు. నాటు బాంబులను అమర్చినట్లు 11 మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించారు. అందులో ఇద్దరు బంగారుపాళెం మండలం రాగిమాను పెంటకు చెందిన విశ్వనాథ్ (39), జమ్మునేరేడుపల్లికి చెందిన వెంకటేశులు (29) నిందితులుగా తేలడంతో వారిని అరెస్టు చేశారు.

దివ్యాంగుల హక్కుల నూతన కమిటీ ఏకగ్రీవం



నూతన కార్యవర్గ సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక చిత్తూరు జిల్లా నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఆ సంఘం రాష్ట్ర కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కలికిరి జయరామయ్య తెలిపారు. సోమవారం చిత్తూరు ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక చిత్తూరు జిల్లా కమిటీని కాణిపాకంలో జరిగిందన్నారు. చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా లోకనాథం, ఉపాధ్యక్షుడిగా రాముడు ఎన్నికయ్యారన్నారు. కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా సరస్వతి, సంయుక్త కార్యదర్శిగా భాస్కర్ నాయుడు, కార్యవర్గ సభ్యులుగా బాలసుబ్రమణ్యం, సునందనను ఎన్నికయ్యారని చెప్పారు.

కాణిపాకంలో ఆరుగురిపై క్రమశిక్షణ చర్యలు

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో పనిచేస్తున్న ఆరుగురిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వినాయకయ్య(డోల్ విద్వాంసులు), సురేష్(తాళం విద్యాంసులు), ప్రవీణ్‌కుమార్(నాదశ్వర విద్యాంసులు), వెంకట శివయ్య(డోలు విద్యాంసులు) బాలాజీ నాయుడు(జూనియర్ అసిస్టెంట్), వెంకటేశులు(గతంలో పనిచేసిన ఈఓ)పై క్రమశిక్షణ తీసుకునేలా ఉత్తర్వులు జారీ చేసింది. వివరాలోకి వెళితే.. 2021లో శ్రీశైలంలో టికెట్ల కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాలపై ఏసీబీ దాడులు జరిగాయి. ఈ క్రమంలో వరసిద్ధి క్షేత్రంపై కూడా 10 మంది ఏసీబీ అధికారులు అప్పట్లో దాడులు చేశారు. ఈ దాడుల్లో విద్యాంసులు పలు కౌంటర్లలో పనిచేస్తున్నట్లు గుర్తించారు. వారి వద్ద రూ.500 నుంచి రూ.5 వేల వరకు నగదు ఉన్నట్లు సోదాలో బయటపడినట్లు అధికారులు చెబుతున్నారు. స్టోర్‌లో సరుకుల్లో తేడాను గుర్తించారని, అది కారణమై ఉండవచ్చన్ని భావిస్తున్నారు. నిర్వహణలో లోపాల కారణంగా అప్పటి ఈఓపై కూడా క్రమశిక్షణ చర్యలు తీసుకుని ఉండవచ్చని తెలుస్తోంది. ఏసీబీ అధికారు ల నివేదిక ఆధారంగానే వివరాలు తెలియాల్సి ఉంది.

బాలభవన్ సూపరింటెండెంట్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న సూపరింటెండెంట్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని బాపుబాలభవన్ సూపరింటెండెంట్ రామచంద్రారెడ్డిని రాష్ట్ర స్థాయి అవార్డు వరించింది. ఇటీవల విజయవాడకు చెందిన స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పాట్ పెయింటింగ్ కార్యక్రమంలో «ప్రకృతిని మనమే కాపాడుకుందాం» అనే అంశంపై బాలభవన్ సూపరింటెండెంట్ వేసిన చిత్రానికి అవార్డు దక్కింది. పోలీస్ కమిషనర్ రాజేంద్రబాబు, స్కూల్ ఆఫ్ పెయింటింగ్ శాఖ డైరెక్టర్ రమేష్ చేతుల మీదుగా ఆయన అవార్డు, జ్ఞాపిక అందుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో మత్స్యకారుడి మృతి

నగరి : స్థానిక కీళపట్టు నాగరాజకుప్పం రోడ్డులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎన్. శేషన్ (64) అనే మత్స్యకారుడు మృతి చెందాడు. సీఐ విక్రమ్ కథనం మేరకు.. విజయపురం మండలం చిన్నమహావీరపురం గ్రామానికి చెందిన శేషన్ చేపల కొనుగోలు చేసినందుకు డబ్బులు ఇచ్చివద్దామని సోమవారం మధ్యాహ్నం నాగరాజకుప్పం వైపుగా ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. నాగరాజకుప్పంరోడ్డులో వెనుక నుంచి వచ్చిన క్రేన్ ఢీకొని, అతడి వాహనాన్ని తొక్కేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి, క్రేన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని క్రేన్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మృతుని కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.